నేటి ఈవార్తలు
PRGI REGD NO: TGTEL/25/A1385 www.evarthalu.com
Published from Jagitial.. Circulated to Telangana
NETI EVARTHALU దినపత్రిక
గురువారం THURSDAY 5-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 245 Issue: 245

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:36 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి పాడ్యమి సా. 4:53 వరకు తరువాత విదియ సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) ఉ. 7:35 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం ధృతి ఉ. 8:50 వరకు కరణం కౌలవ సా. 4:53 వరకు తైతుల తె. 4:540 వరకు వర్జ్యం మ. 3:01 నుండి సా. 4:40 వరకు దుర్ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:51 వరకు రాహుకాలం మ. 12:28 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 8:04 నుండి ఉ. 9:32 వరకు గుళికాకాలం ఉ. 11:00 నుండి మ. 12:28 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:00 నుండి తె. 5:48 వరకు అమృత ఘడియలు రా. 12:52 నుండి రా. 2:31 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# 1,045 మంది మృతి

## ఇరాన్‌లో రోజురోజుకు పెరుగుతున్న మృతులు

### కళ్ల ముందు శిథిలాలు, రక్తసిక్త వీధులు.. ఇరాన్ యుద్ధ నౌకపై దాడి.. 100 మంది మృతి

అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా సాగిస్తున్న దాడులలో ఇరాన్‌లో మృతుల సంఖ్య బుధవారం కనీసం 1045 కు చేరుకుంది. పలు చోట్ల శిథిలాలు, రక్తసిక్త వీధులు కన్పిస్తున్నాయి. మృతుల సంఖ్యను ఇరాన్ ప్రభుత్వ పరిధిలోని అధికారిక సంస్థ బుధవారం అధికారికంగా ప్రకటించింది. రెండు దేశాల సైన్యం నివాసిత ప్రాంతాలపైనే నేరుగా దాడులకు దిగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

టెహ్రాన్: గత శనివారం నుంచి ఆరుగురు అమెరికన్ సైనికులు మరణించగా, వారిలో నలుగురు కువైట్‌లో చనిపోయినట్లు పెంటగాన్ ప్రకటించింది. కువైట్‌లో ఇరాన్ ప్రయోగించిన డ్రోన్ శకలాలు పడి 11 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. ఖతార్‌లోని అల్-ఉదీద్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణితో దాడి చేసినట్లు ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. ఒక క్షిపణిని అడ్డుకోగా, మరొకటి స్థావరాన్ని తాకిందని, అయితే ఎలాంటి ప్రాణనష్టం తరువాయి 2 వ పేజీలో...



# కివీస్.. కసిగా!

ఫైనల్ చేరిన న్యూజిలాండ్.. శతక్కొట్టిన ఫిన్ అలెన్.. రాతమారని సఫారీలు

..పూర్తి వివరాలు 'క్రీడావాణి' పేజీలో..

# ఒకేసారి మూడ్నెల్ల రేషన్!

## వేసవి దృష్ట్యా కేంద్రం నిర్ణయం.. ఏప్రిల్‌లోనే అందరికీ పంపిణీ



కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయానికి తెరతీసింది. వేసవి కాలం రావడంతో.. రేషన్ కార్డు లబ్ధిదారులకు 3 నెలల రేషన్ సరుకులను ఒకేసారి అందించాలని భావిస్తోంది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని.. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని.. ఏప్రిల్ నెలలోనే అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ అధికారులు లేఖలు రాశారు.

న్యూఢిల్లీ: మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతుండగా.. రానున్న రోజుల్లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే భానుడి ప్రతాపం దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు ఉన్నవారికి తరువాయి 2 వ పేజీలో...



## రాజ్యసభకు సింఘ్వీ, వేం

హైదరాబాద్, మార్చి 4 (ఈవార్తలు): తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,451 |
| వెండి (గ్రాము): | రూ.295 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,310 |



# 10 లక్షల కోట్లు ఢమాల్

## సెన్సెక్స్ 1100 పాయింట్లు డౌన్

## 52 వారాల కనిష్టానికి 700 స్టాక్స్

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలో భారీగా పడిపోతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హార్ముజ్ జల సంధిని ఇరాక్ మూసి వేసిన కారణమంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి.

ముంబై: అలాగే తాజా ఉద్రిక్తత కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్లపై ప్రభావం చూపించాయి. అదే జరిగితే అమెరికా ఫెడ్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పట్లో వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చున్న అంచనాలు నెలకొన్నాయి. దీనికి తోడు విదేశీ మదుపరులు భారీగా అమ్మకాలు చేపట్టడం, రుపాయి విలువ భారీగా పడిపోవడం వంటివి మన మార్కెట్లపై తీవ్ర ప్రభావం తరువాయి 2 వ పేజీలో...

# నో నక్సలిజం!

## మార్చి 31న మావోయిస్టు రహిత కార్యక్రమం?

- అమిత్ షాతో భేటీలో పాల్గొన్న రేవంత్
- అదనంగా ఐపీఎస్‌లను కేటాయించండి
- 83 మంది నుంచి105కు పెంచండి
- అమిత్‌షాకు సీఎం విజ్ఞప్తి.. సమీక్షలో డీజీపీ
- మావోయిస్టులు, తదితర అంశాలపై చర్చలు



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో మావోయిస్టుల లొంగుబాట్లపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం తదితర అంశాలు వారి మధ్య ప్రస్తావనకు వచ్చాయి. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన తరువాయి 2 వ పేజీలో...



# గణపతి లొంగుబాటు?

### మావోయిస్టు అగ్రనేత నిర్ణయం!.. అమిత్ షా సమక్షంలో సరెండర్??

మావోయిస్టు అగ్రనేత, సీపీఐ(మావోయిస్టు) మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అమిత్ షా సమక్షంలో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జగిత్యాల, మార్చి 4 (ఈవార్తలు)/న్యూఢిల్లీ: 50 ఏళ్ల పాటు మావోయిస్టు ఉద్యమాన్ని నడిపిన గణపతి.. ఆపరేషన్ కగార్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. నేపాల్‌లో గణపతి ఆశ్రయం పొందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేపాల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న గణపతి.. లొంగిపోతున్నట్లు ఢిల్లీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. గణపతి తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కెన్యా అడవుల్లో వన్య ప్రాణులు నీళ్ల లేక దాహంతో అల్లాడుతున్న విషయం తెలుసుకున్న ప్యాట్రిక్ కిలోంజో మాలువా అనే వ్యక్తి రోజూ 12 వేల లీటర్ల నీటిని వాటికోసం సిద్ధంగా ఉంచుతున్నాడు.

# టమాట.. కిలో రూ.10

## అమాంతం పడిపోయిన ధరలు

### రైతులకు అందేది కిలోకు 2 రూపాయలే!.. కూలీ రావట్లేదని రైతుల ఆవేదన



హైదరాబాద్, మార్చి 4 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల్లో మరోసారి టమాటా ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో టమాటా పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిట్టుబాటు ధర లేక, పంటను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. అయితే మొన్నటివరకు టమాటా -2 వ పేజీలో...

# నితీశ్ రాజీనామా?

## కేంద్ర కేబినెట్‌లోకి బీహార్ సీఎం.. బీజేపీకి ముఖ్యమంత్రి పీఠం!



పాట్నా: బీహార్ రాజకీయాల్లో పెను సంచలనం జరగనుందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే అవకాశం ఉందని సమాచారం అందుతుంది. బీజేపీకి ముఖ్యమంత్రి స్థానం కట్టబెట్టి నితీశ్ కుమారునికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చేలా బీజేపీతో ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. బీహార్ రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారాయి. నిన్నటి వరకూ నితీశ్ కుమార్ కుమారుడు.. నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తున్నారని ఆయన కోసం రాజ్యసభ సీటు సైతం కేటాయించారని జేడీయూ సీనియర్ నేత శ్రవణ్ కుమార్ తెలిపారు. దీంతో నితీశ్ కుమార్ వారసుడి తరువాయి 2 వ పేజీలో...



## ఏపీఎస్ ఆర్టీసీలో దివ్యాంగులకు ఫ్రీ

విజయవాడ, మార్చి 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు. ఇంద్రధనస్సు పేరుతో ఏపీ ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

5.3.2026

మేషం: ఆర్థికంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నూతన రుణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల ప్రవర్తన నిరాశ కలిగిస్తుంది. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలలో అవరోధాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: బాగస్తులతో మాటపట్టింపులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులతో ఊహించిన వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

మిథునం: చిన్ననాటి మిత్రుల నుండి ఆసక్తికర సమాచారం అందుతుంది. అవసరానికి ధనం చేతికి అందుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపార ఉద్యోగాలలో స్వంత నిర్ణయాలు కలసివస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధు మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

కర్కాటకం: చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. దూర ప్రయాణాలు శ్రమతోకూడినవిగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఒక ముఖ్య విషయమై మిత్రులతో మాటపట్టింపులు ఉ ంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

సింహం: ఆత్మీయులు నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆర్థికంగా లాభాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. ఉద్యోగమున మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

కన్య: పాతరుణాల ఒత్తిడితో నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు కలుగుతాయి. నూతన వ్యాపార పెట్టుబడులకు చేసే ప్రయత్నాలు మందగిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది.

తుల: సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది. ధన ఆదాయం బాగుంటుంది.

వృశ్చికం: దీర్ఘకాలిక రుణాలు నుండి ఉపశమనం కలుగుతుంది. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ధన వ్యవహారాలు కలసివస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి.

ధనస్సు: చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దీర్ఘ కాలిక ఋణాల ఒత్తిడి అధికమౌతుంది. వ్యాపార వ్యవహారాలలో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఉ ద్యోగ వాతావరణం కొంత చికాకు కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గోవటం మంచిది.

మకరం: కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలుంటాయి. నిరుద్యోగులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు అంతగా కలసిరావు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కుంభం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో సఖ్యత కలుగుతుంది.

మీనం: గృహమున నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. రాజకీయవర్గాల వారికి పదోన్నతులు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో వివాదాలు పరిష్కారమౌతాయి. దూరపు బంధువులతో పాత విషయాలు చర్చిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పనిచేసి లాభాలు అందుకుంటారు. గృహమున శు భకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి.



# 1,045 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

జరగలేదని అధికారులు తెలిపారు. ఇరాన్ ఏకధాటిగా ప్రయోగిస్తున్న డ్రోన్లు, క్షిపణులను అడ్డుకుంటున్నట్లు యూఏఈ, ఖతార్ ప్రకటించాయి. యూఏఈ మూడు బాలిస్టిక్ క్షిపణులు, 121 డ్రోన్లను అడ్డుకోగా, ఖతార్ 10 డ్రోన్లు, రెండు క్రూయిజ్ క్షిపణులను కూల్చివేసింది. ఈ యుద్ధం అంతర్జాతీయ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. టర్కీ గగనతలంలోకి దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణిని నాటో రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. నాటో, టర్కీ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించాయి. ఇరాన్‌పై దాడుల కోసం తమ దేశంలోని స్థావరాలను ఉపయోగించుకునేందుకు స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ నిరాకరించారు. దీనిపై ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకుంటామని బెదిరించారు. ఈనేపథ్యంలో స్పెయిన్‌కు యూరోపియన్ యూనియన్ మద్దతుగా నిలిచింది. అమెరికా యుద్ధ విమానాలు బ్రిటన్ స్థావరాల నుంచి ఆపరేట్ చేస్తున్నాయని, ఇది తమ దేశాల మధ్య ఉన్న 'ప్రత్యేక బంధానికి' నిదర్శనమని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు.

### ఇరాన్ యుద్ధ నౌకపై దాడి.. 100 మంది మృతి

శ్రీలంకకు సమీపంలో హిందూ మహాసముద్రంలో అమెరికా సబ్‌మెరైన్ ఇరాన్ యుద్ధనౌకపై దాడి చేసింది. ఈ దాడిలో దాదాపు 100 మంది మరణించినట్లు తెలిసింది. శ్రీలంక దక్షిణ తీరానికికి సమీపంలో ఇరాన్ నౌకపై అమెరికన్ జలంతర్గామి దాడి చేసిందని అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ ధ్రువీకరించిన తర్వాత ఈ ప్రకటన వచ్చింది. శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరాత్ గతంలో పార్లమెంటుకు మాట్లాడుతూ మౌడ్జ్-క్లాస్ ఫ్రిగేట్ ఐరిస్ దేనాలో దాదాపు 180 మంది ఉన్నారని, అది ద్వీపం నుండి 40 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదానికి గురైందని చెప్పారు. అమెరికా తన సబ్ మెరైన్ నుంచి టార్పిడోలతో ఇరాన్ యుద్ధ నౌకను ముంచేసినట్లు తెలుస్తోంది. ఐరిస్ దేనా భారత్‌లో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష 2026, మిలాన్ 2026లో పాల్గొని తిరుగి వెళ్తోంది. ఫిబ్రవరి 18 నుంచి ఫిబ్రవరి 25 వరకు బంగాళాఖాతంలో ఈ నౌకదళ విన్యాసాలు జరిగాయి. నౌక నుంచి ప్రమాద సంకేతాలు రాగానే వెంటనే శ్రీలంకన్ నేవీ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. 32 మందిని రక్షించినట్లు, సముద్రం నుంచి అనేక మృతదేహాలను స్వాధీనం చేసున్నట్లు అధికారులు ప్రకటించారు. గాయపడిన వారికి గాలే లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# 10 లక్షల కోట్లు ధమాల్

మొదటి పేజీ తరువాయి

చూపిస్తున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 1700 పాయింట్లకు పైగా నష్టపోయింది. చివరకు మార్కెట్లు ముగిసే నాటికి 1100 పాయింట్ల నష్టంతో ముగిసింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఏకంగా రూ.10 లక్షల కోట్లు ఆవిరైపోయింది. దీంతో కంపెనీల మొత్తం విలువ రూ.456 లక్షల కోట్ల వద్దకు పడిపోయింది. మార్చి 4వ తేదీ స్టాక్ మార్కెట్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఉదయం 78,528 పాయింట్ల వద్ద నష్టాల్లో ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఇంట్రాడేలో 78,443 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 1122,66 పాయింట్ల నష్టంతో 79,116 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైత 385 పాయింట్లు కోల్పోయి24,480 వద్దకు పడిపోయింది. సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మినహా మిగిలిన షేర్లన్నీ నష్టపోయాయి. టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ షేర్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరింది. ఇక బంగారం ఔన్స్ 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇరాన్ పై అమెరికా- ఇజ్రాయెల్ దాడులు ఐదో రోజుకు చేరుకున్నాయి. తాజాగా టెహ్రాన్, బీరుట్ పై దాడులు జరిగాయి. మరో నాలుగైదు వారాల పాటు యుద్ధ కొనసాగవచ్చని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం గమనార్హం. అంతకు మించి కొనసాగినా అందుకు సిద్ధమని పేర్కొన్నారు. దీంతో యుద్ధం దీర్ఘకాలం పాటు కొనసాగవచ్చనే భయాలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లు దాటింది. భారత చమురు అవసరాలు 85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో కరెంట్ ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరుగుతున్నాయి. దీంతో వృద్ధిపై భయాలు నెలకొన్నాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, హార్మూజ్ జల సంధి మూసివేయడం వల్ల ఆయిల్ ధరలు అస్థిరంగా ఉన్నాయన్నారు. ఇది ఇన్‌ఫ్లేషన్, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పెరిగే భయాలు తెచ్చిందన్నారు. రూపాయి బలహీనత, విదేశీ అమ్మకాలు మార్కెట్‌లో అస్థిరతను మరింత పెంచాయని వివరించారు. 'పానిక్ సెల్ చేయకండి. దీర్ఘకాల దృష్టితో జాగ్రత్తగా ఉండండి. ఇప్పటి ధరలు మధ్య, దీర్ఘకాల పెట్టుబడులకు మంచి ఎంట్రీ పాయింట్ కావచ్చు' అని నాయర్ సలహా ఇచ్చారు.

# టమాట.. కిలో రూ.10

మొదటి పేజీ తరువాయి

ధరలు బాగానే పలికినప్పటికీ... ఉత్పత్తి గణనీయండా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రతికూల వాతావరణ పరిస్థితులు, డిమాండ్- సప్లైలో ఒడిదుడుకుల కారణంగా సాధారంగా టమాటా ధరలలో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటాయనే సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో తుఫాన్ పరిస్థితుల కారణంగా టమాటా పంటకు నష్టం వాటిల్లి, సరఫరా తగ్గింది. దీంతో టమాటా ధరలు పెరిగాయి. మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ. 60కి చేరింది. అయితే ఈ క్రమంలోనే సంప్రదాయంగా టమాటా సాగు చేసే ప్రాంతాలతో పాటు... కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామ రాజు, విజయనగరం, శ్రీకాకుళం వంటి జిల్లాల్లో కూడా టమాటా సాగు పెరిగింది. అయితే గత రెండు రోజులు నుంచి మార్కెట్‌లో టమాటా ఉత్పత్తి భారీగా పెరగడంతో... ధరలు బాగా పడిపోయాయి. గత నెలలో కిలో రూ. 20 నుంచి రూ. 30 పలుకగా... ఇప్పుడు చాలా చోట్ల కిలో రూ. 15 కంటే తక్కువకు పడిపోయింది. కొన్నిచోట్ల అయితే టమాటా కిలో ధర రూ. 10 కన్నా తక్కువగా ఉంది. అయితే మార్కెట్‌లలో ధరలు ఇలా ఉంటే... టమాటా రైతులకు కిలో రూ. 2 నుంచి రూ. 4 వరకు లభిస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. దీంతో కొందరు పంటను కోయకుండా పొలాల్లోనే ఉంచుతున్నారు. పంటకోతకు కూడా కిలో రూపాయి వరకు ఖర్చు అవుతుందని... ఇప్పుడు కిలోకు రూ. 2 కూడా ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పెట్టుబడి కాదు కదా, కనీసం కోత కూలి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు రైతులు రోడ్డుమీద పారబోస్తున్నారు. టమాటా అమ్మితే కనీసం చిల్లర పైసలు కూడా రావడం లేదని కన్నీరు పెట్టుకుంటున్నారు. మరికొందరు గిట్టుబాటు ధర కోసం వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు రైతులు తాము పండించిన టమాటాలను వినియోగదారులకు నేరుగా విక్రయించడానికి సహాయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానవన అధికారులు తెలిపారు. మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాల్లో టమాటా పండించిన రైతుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. మార్కెట్‌లో టమాటాకు మంచి ధర వస్తుందని ఆశించి సాగుచేస్తే... ఇప్పుడు పరిస్థితి తారుమారు అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నో నక్సలిజం!

మొదటి పేజీ తరువాయి

మార్పులు వచ్చాయని రేవంత్ చెప్పారు. బుధవారం రాత్రి ఢిల్లీలో అమిత్‌షాతో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి కాలంలోనే 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని షా దృష్టికి తీసుకెళ్లారు. పలువురు అగ్రనేతలు సైతం సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని చెబుతూ.. వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం తదితర విషయాలను వివరించారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి సహకరించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. అటు.. తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని అమిత్‌షాకు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని..తర్వాత 2021లో జరగాల్సిన రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందని తెలిపారు. ఆ సమయంలోనూ కేవలం ఏడుగురు ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని వివరించారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం కూడా సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటు, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని చెప్పారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని, ప్రస్తుతం రాష్ట్రంలో 83 మంది ఐపీఎస్ అధికారులు ఉండగా.. ఆ సంఖ్యను 105కు పెంచాలని రేవంత్ కోరారు.

## ఏపీఎస్ ఆర్టీసీలో దివ్యాంగులకు ఫ్రీ

మొదటి పేజీ తరువాయి

బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. అలాగే దివ్యాం గులతో పాటుగా వారికి ఎస్కార్ట్‌గా వచ్చేవారికి కూడా ఆర్టీసీ బస్సులలో రాయితీ కల్పించనున్నారు. ఎస్కార్టుగా వచ్చేవారికి టికెట్ ధరలో 50 శాతం రాయితీ లభించనుంది. 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం వర్తిస్తుంది. మార్చి 18వ తేదీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మరోవైపు ఐదు రకాల బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఏపీలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే స్త్రీశక్తి పథకం అమల్లో ఉన్న బస్సులలో దివ్యాంగులకు కూడా ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు. 2025 డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంద్రధనస్సు పేరుతో దివ్యాంగులకు వరాలు ప్రకటించారు. అందులో భాగంగానే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు ప్రకటించారు.

# రాజ్యసభకు సింఘ్వీ, వేం

మొదటి పేజీ తరువాయి

పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. గురువారం వీరు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వినయ్‌కుమార్, జెట్టి కుసుమకుమార్ తదితరుల పేర్లు వినిపించినప్పటికీ సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు ఖరారైంది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో హనుమకొండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2015లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. అనంతరం రేవంత్‌రెడ్డితో పాటు వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

# నితీశ్ రాజీనామా?

మొదటి పేజీ తరువాయి

ఎంట్రీ ఖరారైందని అంతా భావించారు. అంతలోనే ఊహించని ట్విస్ట్ జరిగింది. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లనున్నట్లు సమాచారం అందుతుంది. దీనికోసం ఢిల్లీలో ఒప్పంద కూడా జరిగిందని జేడీయూ కీలక నేత చెప్పినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది చాలా బాధపడాల్సిన సమయం అని అంతా ఢిల్లీలోనే జరిగిందని ఆయన ఆ నేత తెలిపినట్లు ప్రచురించాయి. అయితే నితీశ్ కుమార్‌ని వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో నామినేట్ చేయనున్నారని ప్రచారం నడుస్తోంది. ఆయన స్థానంలో నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. కాగా గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. ఆ సమయంలోనే ముఖ్యమంత్రి స్థానం బీజేపీకి దక్కుతుందని ప్రచారం జరిగింది. కానీ చివరికి నితీశ్ కుమారే సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ముఖ్యమంత్రి మార్పు జరగనుందనే ప్రచారం జోరందుకుంది.

# గణపతి లొంగుబాటు?

మొదటి పేజీ తరువాయి

లొంగుబాటుతో మావోయిస్టులో అగ్రనేతల శకం దాదాపు ముగిసినట్లే. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో ఆయన తెలంగాణ పోలీసులతో రహస్య సంప్రదింపులు జరుపుతున్నారని.. త్వరలోనే లొంగిపోయే అవకాశం ఉన్నట్లు సమాచారం. దశాబ్దాల పాటు సాయుధ మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన గణపతి.. 2018లో ప్రధాన కార్యదర్శి పదవి నుండి వైదొలిగారు. గణపతి వయస్సు, అనారోగ్యాన్ని దృష్టిలో ఉ ంచుకుని సాధారణ జీవితం గడపాలని కుటుంబ సభ్యుల కోరిక. తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. గణపతి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బ అని.. వారి సాయుధ పోరాట ముగింపునకు దారితీసే పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గణపతి.. గణపతి పర్యవేక్షణలో దేశంలో సంచలన దాడులు జరిగాయి. మావోయిస్టు నెట్‌వర్క్ విస్తరణలో కీలక పాత్ర పోషించిన గణపతి.. షార్ట్ కట్‌లో పార్టీలో ఎదిగాడన్న వాదన కూడా ఉంది. 1949లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీర్పూర్‌లో ఆయన జన్మించారు. ఉద్యమంలో గణపతిని టీచర్ అని పిలిచేవారు. 1970లో రైతు పోరాటాలు జగిత్యాల జైత్రయాత్ర ద్వారా పోరాటానికి దిగారు. నక్సల్స్ ఉద్యమంలో కొండపల్లి సీతారామయ్య తర్వాత ఆ స్థాయి లీడర్‌గా గణపతికి గుర్తింపు పొందారు. ఇప్పటికీ గణపతి భార్య సుజాత ఉద్యమంలో కొనసాగుతున్నారు. గణపతి స్వస్థలం జగిత్యాల జిల్లా సారంగపూర్.

# ఒకేసారి మూడ్నెల్ల రేషన్!

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సర్కార్ సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఒక్కో లబ్దిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ప్రతీ నెల తెలంగాణ ప్రభుత్వం అందిస్తోంది. ఇక గత ప్రభుత్వ హాయంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ప్రస్తుతం దాదాపు తెలంగాణలో కోటికి పైగా రేషన్ కార్డు లబ్దిదారులు ఉన్నారు. ఇక ఒకేసారి 3 నెలలకు సరిపడా బియ్యం కోటాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలకు సూచించడంతో ఆ మేరకు రాష్ట్రంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయా.. ఇలా ఒకే నెలలో మూడు నెలల బియ్యాన్ని సరఫరా చేయడంపై సాధ్యాసాధ్యాలను తెలంగాణ సర్కార్ పరిశీలిస్తోంది. ఒకేసారి 3 నెలల కోటా బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుండగా.. గతంలో ఇచ్చినప్పుడు అనుభవాల దృష్ట్యా ఇప్పుడు చాలా సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఒకేసారి 3 నెలల రేషన్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో ఒకే నెలలో మూడు నెలల బియ్యం కోటాను పంపిణీ చేశారు. ఆ సమయంలో అటు లబ్ధిదారులతోపాటు.. రేషన్ డీలర్లకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. 3 నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం వల్ల రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుంది. అంతేకాకుండా డీలర్లు, హమాలీ కూలీ కూడా కలిసొచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ 3 నెలల బియ్యాన్ని నిల్వ చేసే సామర్థ్యం తమ వద్ద లేదని అదే పెద్ద సమస్యగా మారిందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇక 3 నెలల రేషన్ పొందాలంటే.. ఒక్కో లబ్దిదారుడు ఒకేసారి 3 వేలి ముద్రలు వేయాల్సి ఉంది. దీనికి తోడు సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుకు దాదాపు 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది. దీంతో గతంలో తలెత్తిన ఇలాంటి సమస్యలను అధికారులు పరిష్కరించాల్సి ఉంది.



# కుక్కలతో వేగేదెలా?

**జర చూడుండ్రి సర్**

**అడిషనల్ కలెక్టర్‌కు మొర**

జగిత్యాల టౌన్, మార్చి 4 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో వీధి కుక్కల బెడదను తీర్చాలని రహ్మత్‌పురా వాసులు అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్‌కు మొరపెట్టుకున్నారు. ఈద్గా సుల్తాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతినిధులు.. వీధి కుక్కల వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా, ఫలితం లేదని వెల్లడించారు. గత నాలుగు రోజులుగా వీధి కుక్కలు చిన్నారులపై దాడులు ఎక్కువయ్యాయని, బుధవారం ఒక బాలికపై కుక్క దాడి చేసి గాయపరిచిందని వివరించారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు యువజన సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.



# మల్యాలలో యువతి అదృశ్యం

మల్యాల, మార్చి 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. జగిత్యాలకు చెందిన షేక్ షఫీ కుమార్తె షేక్ షరీన్, మల్యాలలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆమె తిరిగి రాలేదు. పాఠశాలకు కూడా వెళ్లలేదని తెలియడంతో తండ్రి ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ ఉంది. తండ్రి షేక్ షఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు



# కొండగట్టు ఆలయ ఈవోగా రమాదేవి బాధ్యతలు

మల్యాల, మార్చి 4 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ఈవోగా పనిచేస్తున్న ఎల్ రమాదేవి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) బుధవారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమె అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.



# మళ్లీ ఓడిన గుకేశ్

ప్రాగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు మూడో పరాజయం ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్, భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరంతో జరిగిన ఆరో రౌండ్‌లో గుకేశ్ 48 ఎత్తుల్లో ఓడిపోయాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 1.5 పాయింట్లతో చివరిదైన పదో స్థానంలో ఉండటం గమనార్హం. అరవింద్ 2.5 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ జోర్డెన్ వాన్ ఫోరీస్ట్ 4.5 పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఇదే టోర్నీ చాలెంజర్స్ విభాగంలో పోటీపడుతున్న ప్రపంచకప్ చాంపియన్, భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ఖాతాలో నాలుగో 'డ్రా' చేరింది. థామస్ బీర్డ్‌సన్ (నెదర్లాండ్స్)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను దివ్య 34 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ప్రస్తుతం దివ్య మూడు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.

# టీచర్ల జీతాలు తగ్గించం

**నెల రోజుల్లో కొత్త విద్యా విధానం**

**వారంలో ఉపాధ్యాయ సంఘాలతో భేటీ**

**ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు వెల్లడి**



హైదరాబాద్, మార్చి 4 (ఈవార్తలు): వారంలో ఉపాధ్యాయ సంఘాల తో సమావేశం ఏర్పాటు చేస్తామని, మరో నెల రోజు ల్లో కొత్త విద్యా విధానం తీసుకొస్తామని రాష్ట్ర ప్రభు త్వ సలహాదారు, తెలంగాణ విద్యా విధానం రూపకల్పనకు ఏర్పాటైన కమిటీ చైర్మన్ కె.కేశవరావు చెప్పా రు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇచ్చిన నివేదిక విద్యా విధానం కాదని, సిఫారసులు మాత్రమేనని కేకే స్పష్ట చేశారు. ముర ళి నివేదికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. విద్యా కమిషన్ నివేదికతో పాటు మరో మరో 14 నివేదికలపై చర్చించి, అందరి అభిప్రాయా ల మేరకు మరో నెల రోజుల్లో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులతో చర్చించిన తర్వాతే హైపవర్ కమిటీ నూతన విద్యా పాలసీని రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తుందని తెలిపారు. ఈ పాలసీలోని అంశాల అమలు, వాటి సాధ్యాసాధ్యాలపైన మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని కేకే చెప్పారు. విద్యకు సంబంధించి పలు సిఫారసులు చేయడంలో మురళి కమిషన్ బాగా పని చేసిందని అన్నారు. విద్యా కమిషన్‌లో పీహెచ్‌డీ చేసిన వారు లేరనడం సరైంది కాదని, విశ్వవిద్యాలయ విభాగం హెడ్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పీఎస్ విశ్వేశ్వర్‌రావు లాంటి వారు ఉన్నారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా తమ సిఫారసులతో కూడిన నివేదికను సమర్పించాయని, వీటన్నింటిపైనా చర్చిస్తామని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విశ్వవిద్యాలయ ఉప కులపతులు, ప్రొఫెసర్లు, మేధావుల స్థాయిలో మొత్తంగా 11 కమిటీలను ఏర్పాటు చేశామని కేకే వివరించారు. విద్యా రంగంలో గురువుల సేవలు వెలకట్టలేమని, తాను కూడా టీచర్‌గా పని చేశానని గుర్తు చేశారు.

# రోడ్డుపై నెత్తుటి ధార


**రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం**

**లారీని అతివేగంతో ఢీకొట్టిన కారు.. ఏపీలోని చిత్తూరులో ఘటన**



చిత్తూరు, మార్చి 4 (ఈవార్తలు): ఏపీలోని చిత్తూరు జిల్లా పలమనేరు బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మృతులు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వారుగా తెలుస్తోంది. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు బెంగళూరు నుంచి తిరుమల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది అని తెలుస్తోంది. యాక్సిడెంట్ గురించి తెలుసుకున్న పలమనేరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం వైఎస్ఆర్ జంక్షన్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. ప్రమాదంపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# 6.28 లక్షల ఉద్యోగాలిచ్చాం: చంద్రబాబు



అమరావతి, మార్చి 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 20 నెలల కాలంలో సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభ వేదికగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగ కల్పన, వైద్య, విద్య తదితర కీలక రంగాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. కేవలం 20 నెలల్లోనే రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని సీఎం అధికారికంగా ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, వివిధ పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గణాంకాలతో సహా వివరించారు. అలాగే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో కలిపి 30,500 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను కల్పించి మాట నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డ సీఎం, 2019-24 మధ్య కాలంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల వల్ల 913 కంపెనీలు మూతపడ్డాయని ఆర్బీఐ నివేదికే స్వయంగా వెల్లడించిందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు చిరునామాగా ఉన్న ఏపీని, ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా మారుస్తున్నామని చెప్పారు. కేవలం 26 కొత్త పాలసీలతో వేగంగా అనుమతులు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో ఏకంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా భవిష్యత్తులో 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఎన్డీఏ కూటమి పాలనపై నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్, టాటా-టీసీఎస్ వంటి దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, త్వరలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్లకు శంకుస్థాపన చేయబోతున్నామని ప్రకటించారు. అలాగే ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, టాటా సంస్థ ద్వారా రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మరో యూనిట్ రాబోతోందని చెప్పారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఎకోసిస్టమ్, విశాఖలో ఐటీ హబ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువత నైపుణ్యాలకు పదును పెడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదని, అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుందని స్పష్టత ఇచ్చారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు కనీసం భూమిని కూడా చూపించలేకపోయారని విమర్శించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, సూర్యలంక, గండికోట వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని సీఎం మండిపడ్డారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం పారదర్శక విధానంతో అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యా రంగంలోనూ తెలుగు భాషను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు ఫ్రీ కరెంట్

**ఏపీ నేతన్నలకు 365 రోజులు ఉపాధి**



అమరావతి, మార్చి 4 (ఈవార్తలు): నేతన్నలకు నిరంతర ఉపాధే లక్ష్యం అని ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర సచివాలయంలో చేనేత స్టాళ్లను మంత్రి సవిత ప్రారంభించారు. '50 శాతం డిస్కౌంట్లపై చేనేత ఉత్పత్తుల అమ్మకాలు ప్రారంభించాం. వెంకటగిరి, గద్వాల్, ఉప్పాడ, ధర్మవరం చీరలు విక్రయిస్తాం. చేనేత స్టాళ్లకు ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభిస్తుంది'అని మంత్రి సవిత అన్నారు. నేతన్నలకు నిరంతర ఉపాధే ప్రభుత్వం లక్ష్యం అని చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆప్కో ప్రత్యేక చేనేత స్టాల్‌ను ప్రారంభించినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. 50 శాతం డిస్కౌంట్లపై రాష్ట్రం తయారవుతున్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పట్టు చీరలు, ఇతర చేనేత చీరలు, రెడీమేట్ వస్త్రాలను విక్రయించనున్నామన్నారు. నేతన్నలకు నిరంతరం ఉపాధి కల్పించాలన్న లక్ష్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర సచివాలయంలోని నాలుగు బ్లాక్ వద్ద మూడు చేనేత స్టాళ్లను మంత్రి సవిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాళ్లలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. రాష్ట్ర సచివాలయ మహిళా ఉద్యోగుల వినతి మేరకు ప్రత్యేక చేనేత స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి సవిత వెల్లడించారు. రానున్న జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని చేనేత ఉత్పత్తులను 50 శాతం డిస్కౌంట్లపై విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల పదో తేదీ వరకూ ఈ స్టాళ్లను కొనసాగించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ స్టాళ్లలో ప్రఖ్యాత గాంచిన వెంకటగిరి, గద్వాల్, మదనపల్లె, ఉప్పాడ, ధర్మవరం, మంగళగిరి పట్టు, కాటన్ చీరలు, షర్ట్ లు, ఇతర రెడీమేడ్ చేనేత వస్త్రాల విక్రయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నామన్నారు. నేతన్నలకు వ్యక్తిగత అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి సవిత అన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, చేనేత బజార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత అన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో వారం రోజుల పాటు ఏర్పాటు చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభించిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, ఉద్యోగులు చేనేత వస్త్రాల కొనుగోలుకు ముందుకొచ్చారన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన స్టాళ్లకు ఉద్యోగుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచి, నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేసిన చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఇతర అధికారులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, ఎం.ఈశ్వర్, రాష్ట్ర సచివాలయం మహిళా ఉద్యోగ సంఘ ప్రతినిధులు దుర్గ, సత్యవతి, సునీత, కవిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# నీ భార్యతో కలిసి గుడికి వచ్చావా?

**హిందూత్వంపై మాట్లాడే అర్హత లేదు**

**జగన్‌పై బీఆర్ నాయుడు తీవ్ర ఆగ్రహం**

తిరుపతి, మార్చి 4 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ పై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆయన జగన్‌ను ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందుత్వం గురించి గానీ, శ్రీవారి గురించి గానీ మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఒక పథకం ప్రకారం తిరుమల కొండపై యథేచ్ఛగా అన్యమత ప్రచారం చేశారు. అన్యమతస్తుడవైన నువ్వు ఇప్పటివరకు దేవదేవునిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదు? సీఎంగా ఉండగా నీ భార్యతో కలిసి గుడికి వచ్చి పట్టు వస్త్రాలిచ్చావా?... రాలేదే! నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు.. ఎందుకంటే మీ ఇద్దరూ నమ్మేది ఏసుప్రభువునే కానీ, శ్రీ వేంకటేశ్వర స్వామిని కాదు కాబట్టి... ఇది ఒప్పుకో జగన్! నేను చైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు టీటీడీని ప్రక్షాళన చేస్తున్నాం. నీ అండతో నీ బాబాయ్, భూమన చేసిన అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయనే నీ బాధంతా! టీటీడీలో అన్యమతస్తులు ఉండరాదని నేను నిర్ణయం తీసుకున్న నాడే నాపై పథకం ప్రకారం కుట్రలు ప్రారంభించావు.

# 26 రకాల వివరాలతో ఫ్యామిలీ కార్డు: చంద్రబాబు

అమరావతి, మార్చి 4 (ఈవార్తలు): ఏపీలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్ బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు.

# మాకు 70 సీట్లు ఇవ్వాల్సిందే

**21 ఇస్తే ఒప్పుకోం.. జనసేన నేత కిరణ్ రాయల్**

తిరుపతి, మార్చి 4 (ఈవార్తలు): ఏపీ రాజకీయాల్లో జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని, కేవలం 21 సీట్లు ఇస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికలతో పోలిస్తే జనసేన పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులో సీట్ల సర్దుబాటులో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పరోక్షంగా మిత్రపక్షాలకు సూచించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వల్లే ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని కిరణ్ రాయల్ అన్నారు. "పవన్ కల్యాణ్ లేకపోతే టీడీపీ ఎన్నికల బరిలో నిలబడటమే కష్టమయ్యేది. ఈ విషయంలో టీడీపీ నేతలకు నేను సవాల్ విసురుతున్నా" అని వ్యాఖ్యానించారు. రాజమండ్రి జైలులో చంద్రబాబు ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, పవన్ ముందుకొచ్చి కూటమి ఏర్పాటు చేసి వారికి ధైర్యం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో పవన్ చూపిన చొరవ వల్లే కూటమి విజయం సాధించిందని, ప్రజలు పవన్ కల్యాణ్‌ను నమ్మి ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవడానికి గల కారణాలను కూడా కిరణ్ రాయల్ వివరించారు. రాజకీయాల్లో ప్రజాబలంతో పాటు ఆర్థిక బలం కూడా అవసరమని, ఆ సమయంలో ఆర్థికంగా బలంగా లేకపోవడం వల్లే పోటీకి దూరంగా ఉన్నానని తెలిపారు. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, హరిప్రసాద్‌తో తనకు విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. తామంతా పవన్ నాయకత్వంలో జనసేన పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేశాయి. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లోనూ 100 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రక విజయం సాధించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# అమెరికాకు క్షిపణుల లోటు!

## మరో 10 రోజుల్లో తగ్గనున్న నిల్వలు.. పెంటగాన్ నివేదిక లీక్

పెంటగాన్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతోంది. యుద్ధం కొనసాగుతున్న ఈ పరిస్థితుల్లో పెంటగాన్ నుంచి వచ్చిన హెచ్చరిక చర్చనీయాంశంగా మారింది. అమెరికా వద్ద రోజురోజుకూ క్షిపణి నిల్వలు తగ్గిపోతున్నట్లు పెంటగాన్ నివేదిక లీక్ అయింది. మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే కీలకమైన క్షిపణుల నిల్వలు తగ్గిపోవచ్చని ఈ నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా ఇంటర్ సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కోవడంలో ప్రస్తుతం ఇవి కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఈ క్రమంలో పది రోజులు దాడులు కొనసాగితే పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఆయుధ, క్షిపణి సంపత్తిని తిరిగి పెంచుకునేందుకు అధిక ఖర్చులు భరించాల్సి ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. కీలకమైన ఆయుధాల కొరత వల్ల ఇరాన్ దాడులను తిప్పికొట్టడం అసాధ్యంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. గత కొన్నేళ్లుగా మిత్రదేశాలైన ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లకు ఆయుధ సంపత్తిని అందిస్తుండటంతో నిల్వలు తగ్గిపోతున్నట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటన మాత్రం మరోలా ఉంది. తమ వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో పోరాడటానికి కావాల్సిన ఆయుధాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక ఆయుధాలను ఇతర దేశాల్లోనూ నిల్వ చేశామని వెల్లడించారు. ఇరాన్‌పై దాడులు మరో ఐదు వారాలు లేదా అంతకంటే ఎక్కువగా కొనసాగవచ్చునని తెలిపారు.



### రక్షణ రంగ కాంట్రాక్టర్లతో ట్రంప్ ఎమర్జెన్సీ మీటింగ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్‌తో ఐదు రోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం చేస్తోన్న విషయం తెలిసిందే. మరో నాలుగైదు వారాలు ఈ యుద్ధం కొనసాగవచ్చని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో అమెరికా వద్ద ఉన్న క్షిపణి, ఆయుధ నిల్వలు తగ్గుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అత్యవసర సమావేశానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. రక్షణ రంగ కాంట్రాక్టర్లు, ఇతర ఉన్నతాధికారులను ట్రంప్ శ్వేతసౌధానికి ఆహ్వానించినట్లు అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఆయుధ ఉత్పత్తిని త్వరితగతిన పెంచే అంశంపై వారితో ఆయన చర్చించే అవకాశాలున్నాయి. రెండు రోజుల్లో ట్రంప్ వారితో భేటీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా అమ్ములపొదిలో భారీగా క్షిపణులు తగ్గిపోయినట్లు పెంటగాన్ నివేదిక లీక్ అయింది. ఆయుధ కర్మాగారాన్ని తిరిగి నింపడానికి రక్షణ శాఖ పెంటగాన్ చర్యలు తీసుకుంటున్నట్లు కథనాలు వచ్చాయి. ఇందుకు భారీ మొత్తంలో ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశాయి. గత మూడు నాలుగేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం సాగుతోంది. ఉక్రెయిన్‌కు నాలుగేళ్లుగా అమెరికా ఆయుధాలు అందిస్తోంది. అమెరికా వద్ద ఆయుధాలు తగ్గిపోవడానికి ఇది కూడా కారణం.



## ఇరాన్‌పై అమెరికా ఏఐ ఆయుధాలు

టెహ్రాన్: ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణలో అమెరికా సరికొత్త టెక్నాలజీని వాడుతోంది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ యుద్ధంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ బుధవారం నాడు ధృవీకరించారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ ఏఐ సామర్థ్యాలున్న డ్రోన్లు, ఇతర వ్యవస్థలను రంగంలోకి దించినట్లు తెలిపారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా వాటి పూర్తి వివరాలను వెల్లడించలేనని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు 2,000కు పైగా లక్ష్యాలను ధ్వంసం చేశామని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, జనరల్ డాన్ కెయిన్ తెలిపారు. ప్రధానంగా మూడు లక్ష్యాలతో ఈ దాడులు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలను పూర్తిగా నాశనం చేయడం, వారి నౌకాదళాన్ని నిర్వీర్యం చేయడం, తిరిగి సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరించుకోకుండా చూడటమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. యుద్ధ వ్యూహాన్ని కూడా మార్చినట్లు అమెరికా సైన్యం తెలిపింది. దూరం నుంచి జరిపే దాడుల స్థానంలో, ఇప్పుడు నేరుగా ఇరాన్ గగనతలంలోకి వెళ్లి కచ్చితమైన లక్ష్యాలపై దాడులు చేస్తున్నామని జనరల్ కెయిన్ చెప్పారు. తమ దాడుల తర్వాత ఇరాన్ క్షిపణి ప్రయోగాల తీవ్రత గణనీయంగా తగ్గిందని, పోరాటం మొదలైన నాటితో పోలిస్తే ఇవి 86 శాతం తగ్గాయని వెల్లడించారు. అయితే, ఈ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇది చాలా సంక్లిష్టమైనది, ప్రమాదకరమైనదని ఆయన పేర్కొన్నారు.

## మోదీకి 'యుద్ధం' తెలీదు: ఇజ్రాయెల్

జెరూసలెం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై దాడులు జరగడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఫిబ్రవరి 25, 26 తేదీలలో మోదీ రెండు రోజుల పాటు పర్యటించారు. మోదీ పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడుల గురించి మోదీకి తెలుసని ఇలా వివిధ రకాల ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. ఇరాన్‌పై దాడికి, మోదీ పర్యటనకు సంబంధం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై దాడి ఒక ఆపరేషనల్ అవకాశమని అన్నారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాక ఆ అవకాశం వచ్చిందని తెలిపారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించామని, యుద్ధం గురించి ఆయనతో చర్చించలేదని స్పష్టం చేశారు. ఆ సమయానికి దాడులు చేస్తామనే విషయం మాకు కూడా తెలియదని అన్నారు. మోదీ వెళ్లిపోయాక ఇరాన్‌పై దాడి గురించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28న ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఆ తర్వాతే దాడులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ దాడులకు సంబంధించి చాలాకాలం ముందు నుంచి అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్నామని, అది ఇప్పుడు కుదిరిందని రూవెన్ అజర్ తెలిపారు.


## 15 లక్షల యూజర్లను కోల్పోయిన ఓపెన్‌ఏఐ

న్యూయార్క్: సామ్ ఆల్ట్ మన్ నేతృత్వంలోని ఓపెన్‌ఏఐ తన ఏఐ మోడళ్లను ఉపయోగించుకోవడానికి అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్‌కు అనుమతించడంతో ఆ సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా రక్షణ శాఖలో తమ ఏఐ మోడల్స్ వినియోగానికి ఓపెన్‌ఏఐ పెంటగాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కుదిరిన 48 గంటల్లో ఆ సంస్థకు చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీజీ నుంచి 15 లక్షల మంది వినియోగదారులు వైదొలిగారు. అయితే ఇందుకు సంబంధించి సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మిలటరీ ఆపరేషన్‌లలో ఏఐ వినియోగానికి మద్దతు ఇవ్వడం పట్ల యూజర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్‌ఏఐని వీడటంతో పాటు కొంతమంది సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకుంటున్నారు. ఈ దెబ్బతో యాప్ స్టోర్ ర్యాంకింగ్‌లో చాట్‌జీపీటీని ఆంత్రోపిక్స్ క్లాడ్ అధిగమించింది. మొదట ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను తమ సైన్యం అపరిమితంగా ఉపయోగించుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. ఈ చర్య ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ తిరస్కరించారు. తమకు యాక్సెస్ ఇవ్వని ఆంత్రోపిక్‌తో వ్యాపారం చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో ఆంత్రోపిక్ ప్రత్యర్థి సంస్థ ఓపెన్‌ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది.

## అమెరికా రాడార్ స్టేషన్ ధ్వంసం

**ఏడు సైనిక స్థావరాల్లోని సదుపాయాలకు నష్టం**

టెహ్రాన్: మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తీవ్ర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన కీలకమైన కమ్యూనికేషన్, రాడార్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా, ఖతార్ లో అమెరికాకు అత్యంత కీలకమైన రాడార్ స్టేషన్ ఇరాన్ దాడుల్లో ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న ప్రాంతంలో ఈ దాడులతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. న్యూయార్క్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం, కనీసం ఏడు అమెరికా సైనిక స్థావరాల్లోని కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. శాటిలైట్ చిత్రాలు, ధృవీకరించిన వీడియోల ఆధారంగా ఈ నివేదిక వెల్లడించింది. బాలిస్టిక్ క్షిపణులను గుర్తించే వ్యవస్థలు, శాటిలైట్ డిష్‌లు, సున్నితమైన పరికరాలను కాపాడే రాడోమ్‌ల వద్ద నష్టం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. అమెరికా సైనిక సమాచార వ్యవస్థ అత్యంత రహస్యంగా ఉన్నప్పటికీ, లక్ష్యాలను బట్టి చూస్తే వారి కమ్యూనికేషన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఇరాన్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. వీటికి ప్రతీకారంగానే తాము ఈ దాడులు చేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడుతోంది. గత జూన్‌లో కూడా ఖతార్‌లోని ఒక అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి చేసి కమ్యూనికేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే స్థావరంపై దాడి చేయడం గమనార్హం. ఒకవైపు అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, మరోవైపు ఇరాన్ ప్రతీకార దాడులతో మధ్యప్రాచ్య సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.





## రోజంతా బ్యాటరీ

**ఆపిల్ నుంచి కొత్త మ్యాక్‌బుక్**

**ఏ18 ప్రో చిప్‌తో లాంచ్**

**ఏఐ పనుల కోసం ప్రత్యేక ప్రాసెసర్**

న్యూయార్క్: టెక్ దిగ్గజం ఆపిల్ తన ల్యాప్‌టాప్ శ్రేణిలో మరో కొత్త ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. 'మ్యాక్‌బుక్ నియో' పేరుతో వచ్చిన ఈ సరికొత్త ల్యాప్‌టాప్‌ను బుధవారం లాంచ్ చేసింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పనులను వేగంగా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ఏ18 ప్రో చిప్‌ను ఇందులో అమర్చారు. 13 అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే దీని ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 16 గంటల వరకు నిరంతరాయంగా రోజంతా పనిచేసే బ్యాటరీ లైఫ్‌ను ఈ మ్యాక్‌బుక్ నియో అందిస్తుంది. వీడియో కాల్స్ కోసం 1080జూ ఫేస్‌టైమ్ హెచ్‌డీ కెమెరా, స్పష్టమైన ఆడియో కోసం డ్యూయల్ మైక్స్, స్పేషియల్ ఆడియో సపోర్ట్‌తో డ్యూయల్ సైడ్-ఫైరింగ్ స్పీకర్లను పొందుపరిచారు. సౌకర్యవంతమైన టైపింగ్ కోసం మ్యాజిక్ కీబోర్డును, సులభమైన కంట్రోల్ కోసం పెద్ద మల్టీ-టచ్ ట్రాక్‌ప్యాడ్‌ను ఇచ్చారు. మ్యాక్‌బుక్ నియోను దృఢమైన అల్యూమినియం బాడీతో రూపొందించారు. ఇది బ్లష్, ఇండిగో, సిల్వర్, కొత్తగా సిట్రస్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. కేవలం 2.7 పౌండ్ల (సుమారు 1.22 కిలోలు) బరువుతో దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. భారత్‌లో మ్యాక్‌బుక్ నియో ప్రారంభ ధర రూ. 69,900గా నిర్ణయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ. 59,900కే అందిస్తున్నారు. అమెరికాతో సహా 30 దేశాల్లో నేటి నుంచే ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. మార్చి 11 నుంచి ఆపిల్ స్టోర్లు, అధీకృత విక్రయ కేంద్రాల్లో ఇది అందుబాటులోకి వస్తుంది. "తక్కువ ధరలోనే మ్యాక్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో మ్యాక్‌బుక్ నియోను తీసుకొచ్చాం" అని ఆపిల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టెర్నస్ తెలిపారు. "అద్భుతమైన డిజైన్, శక్తిమంతమైన పనితీరు, రోజంతా పనిచేసే బ్యాటరీతో ఇంతటి ల్యాప్‌టాప్‌ను కేవలం ఆపిల్ మాత్రమే తయారు చేయగలదు" అని ఆయన వివరించారు.

## ఇరాన్ అణు ప్రాజెక్టు ధ్వంసం: ఇజ్రాయెల్

ఇరాన్‌లోని రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదేహైలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఈ అణు ప్రాజెక్టుపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ వెల్లడించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందని, దీనితో దాడి జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడకు మళ్లించిందని వెల్లడించారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ రోజు దాడికి ఉపయోగించిన మందుగుండు సామాగ్రి కంటే ఈ నాలుగు రోజుల్లో ఉపయోగించిందే ఎక్కువ అని తెలిపారు. గతంలోనే ఇరాన్ అణుస్థావరాలపై తాము దాడులు చేశామని డెఫ్రిన్ తెలిపారు. అయినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపలేదని అన్నారు.

# ముజ్తబానే ఇరాన్ సుప్రీం



టెహ్రాన్: ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ముజ్తబా ఖమేనీ ఎన్నికైనట్టుగా తెలుస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగగా, ఇరాన్ సైతం ప్రతికార దాడులు చేపట్టింది. దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇజ్రాయెల్, అమెరికాలో చేపట్టిన దాడుల్లో తొలి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. దాదాపు 36 ఏళ్లకు పైగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా కొనసాగిన ఖమేనీ మరణంతో దేశంలో పలువురు కన్నీరు పెట్టుకున్నారు. మరోవైపు ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ఈ క్రమంలోనే రాజ్యాంగ నిబంధనల ప్రకారం తాత్కాలికంగా సుప్రీం లీడర్ బాధ్యతలను నిర్వర్తించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ముజ్తబా ఖమేనీ ఎన్నికైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇరాన్ ఇంటర్నేషనల్ రిపోర్టు చేసింది. ఇరాన్ నిపుణుల అసెంబ్లీ ముజ్తబాను దేశ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నప్పటికీ, అసలు ఎంపిక వెనక ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కీలక పాత్ర పోషించినట్టుగా తెలుస్తోంది. అయితే ఈ నిర్ణయం ఇంకా బహిరంగంగా వెల్లడి కాలేదు. అయితే అయతుల్లా ఖమేనీ అంత్యక్రియల తర్వాత ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. అయితే ఆయతుల్లా ఖమేని రెండో కుమారుడే ముజ్తబా. అయితే ఆయతుల్లా అలీ ఖమేనీ కొడుకైడా ముజ్తబా... వారసత్వంగా ఈ బాధ్యతలు చేపట్టడం లేదు. ముజ్తబాను ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపిక చేయడం వెనక అనేక కారణాలు ఉన్నాయి ముజ్తబాకు ఐఆర్‌జీసీతో బలమైన సంబంధాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇజ్రాయెల్, అమెరికాలతో ఇరాన్ యుద్ధం చేస్తుండటంతో, పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాలు వేళ ముజ్తబా ఇరాన్ అత్యున్నత పదవిని చేపట్టనుండటం గమనార్హం. ఐఆర్‌జీసీతో ముజ్తబాకు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. భద్రతా బలగాల పట్టు కోల్పోకుండా, అధికారం కోసం అంతర్గత పోరాటాలు జరగకుండా ఆయన వ్యవస్థను కాపాడగలరని చాలా మంది నమ్ముతున్నారు. అలాగే... ఐఆర్‌జీసీ భద్రతా కేంద్రానికి దగ్గరగా ఉండమే కాకుండా, పౌర, మతాధికారుల నాయకత్వంతో సంబంధం కలిగి ఉన్నారు. ఆయనను సాధారణంగా అయతుల్లా ఖమేనీకి అత్యంత సన్నిహితుడిగా భావిస్తుంటారు. అంతేకాకుండా, ముజ్తబా ఖమేనీ గత రెండు దశాబ్దాలుగా ఆయతుల్లా ఖమేనీ కార్యాలయం, బీట్ రహ్బరిని కూడా సమర్థవంతంగా నడిపారు. ఖమేనీ కుమారుడు కావడం కూడా ముజ్తబా చాలా వర్గాలకు ఆమోదయోగ్యమైన వ్యక్తిగా ఉన్నారు. ఇరాన్ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా ఉండాలన్నా, విదేశీ శక్తులతో తలపడాలన్నా లేదా వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గాలన్నా.. ఆ పరిస్థితులను తట్టుకుని నిలబడగల ఏకైక వ్యక్తిగా మొజ్తబాను ఐఆర్‌జీసీతో పాటు పలు వర్గాలు నమ్ముతున్నాయి. అయితే ఈ సంఘర్షణలో అంతిమ నిర్ణయం తదుపరి సుప్రీం నాయకుడు ముజ్తబా ఖమేనీ వద్ద ఉంది. కానీ ఆయన ఎలాంటి వైఖరితో ముందుకు సాగుతారనేది వేచిచూడాల్సి ఉంది.

### సుప్రీం ఎవరైనా చంపేస్తాం: ఇజ్రాయెల్

ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడిలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఖమేనీ మృతి చెంది నాలుగు రోజులైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. ఇలాంటి సమయంలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ కీలక ప్రకటన వచ్చింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని, అమెరికాను బెదిరించే ప్రయత్నం చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. ఈ ప్రాంతంతో పాటు ప్రపంచ దేశాలను అణిచివేయడానికి, బెదిరించడానికి ఆ దేశ ప్రభుత్వం నియమించిన ఏ నాయకుడినైనా నిస్సందేహంగా అంతం చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. సుప్రీం లీడర్‌గా కొత్తగా ఎవరు ఎన్నికైనా, ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టబోమని అన్నారు. అమెరికా భాగస్వామ్యంతో, ఇరాన్ పాలన సామర్థ్యాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఖమేనీ రెండో కుమారుడు ముజ్తబాను దేశ సుప్రీం లీడర్‌గా ఇరాన్ అసెంబ్లీలోని కీలక నేతలు ఎన్నుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ)తో బలమైన సంబంధాలు కలిగిన అతను త్వరలో బాధ్యతలు చేపడతారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ నుంచి కీలక ప్రకటన వెలువడింది.

## పాక్ - ఆఫ్ఘన్ ఉద్రిక్తతలు తీవ్రం

కాబూల్: పాకిస్థాన్ - ఆఫ్ఘనిస్థాన్ మధ్య గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు మరింత తీవ్ర రూపం దాల్చి, పెను విషాదాన్ని నింపుతున్నాయి. ఇరు దేశాల మధ్య జరుగుతున్న ఈ భీకర పోరు కారణంగా సరిహద్దు ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు చెల్లాచెదురై రోడ్డున పడ్డాయి. గత గురువారం నుంచి ప్రారంభమైన ఈ ఘర్షణలు ఇరు దేశాల సైనిక చర్యలతో మరింత దారుణంగా మారాయి. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఆఫ్ఘనిస్థాన్‌లోని పలు ప్రాంతాల నుండి సుమారు 20,000 కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. ఈ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు కనీసం 42 మంది పౌరులు మరణించగా, వందకు పైగా ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో



చిన్నారులు కూడా ఉండటం తీవ్రంగా కలచివేస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో మానవతా సంక్షోభం ఏర్పడింది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లోని ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో, ఈ ప్రాంతాల్లో అత్యవసర ఆహార సరఫరా నిలిచిపోవడంతో సుమారు 1.6 లక్షల మంది ఆకలితో అలమటించే ప్రమాదం ఉందని ప్రపంచ ఆహార కార్యక్రమం హెచ్చరించింది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులకు ప్రతిగా తాము దాడులు ప్రారంభించినట్లు ఆఫ్ఘన్ ప్రకటించగా, ఇస్లామాబాద్ సైతం వెనక్కి తగ్గకుండా కాబూల్, కాందహార్, వ్యూహాత్మక బాగ్రామ్ ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడింది. ముఖ్యంగా కునార్ ప్రాంతంలో క్షిపణి దాడులు, భారీ ఆయుధాల మోతతో ప్రజలు భీతావహ స్థితిలో కాలం గడుపుతున్నారు. సైనిక పరంగా కూడా ఇరు దేశాలకు భారీ నష్టం వాటిల్లింది. ఆఫ్ఘన్ తన వైపు 25 మంది సైనికులు మరణించారని చెబుతూనే, సుమారు 150 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్లు సంచలన ప్రకటన చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దిగజారే పరిస్థితి కనిపిస్తోంది.



## యుద్ధ వీడియోలు చేస్తే 90 రోజులు సస్పెన్షన్: ఎక్స్

న్యూయార్క్: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) తమ కంటెంట్ క్రియేటర్లకు కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో సృష్టించిన యుద్ధ సంబంధిత వీడియోలను పోస్ట్ చేసేటప్పుడు, ఆ విషయాన్ని స్పష్టంగా వెల్లడించకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. అలాంటి క్రియేటర్లను రెవెన్యూ-షేరింగ్ ప్రోగ్రామ్ నుంచి 90 రోజుల పాటు సస్పెండ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలను ఎక్స్ ప్రొడక్ట్ హెడ్ నికితా బేర్ వెల్లడించారు. యుద్ధ సమయాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తిని అరికట్టి, ప్లాట్‌ఫామ్‌పై వాస్తవికతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "ప్రస్తుత ఏఐ టెక్నాలజీతో ప్రజలను సులభంగా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను సృష్టించవచ్చు. అందుకే ఈ మార్పులు చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. మొదటిసారి సస్పెన్షన్ తర్వాత కూడా నిబంధనలను ఉల్లంఘిస్తే, రెవెన్యూ ప్రోగ్రామ్ నుంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. కమ్యూనిటీ నోట్స్ లేదా ఏఐ టూల్స్ మెటాడేటా ద్వారా ఇలాంటి కంటెంట్‌ను గుర్తిస్తామని నికితా వివరించారు. ఇప్పటికే ఏఐతో రూపొందించిన కంటెంట్‌ను గుర్తించేందుకు 'మేడ్ విత్ ఏఐ' అనే లేబుల్‌ను ఎక్స్ పరిచయం చేసింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య నేపథ్యంలో తమ ప్లాట్‌ఫామ్‌పై ట్రాఫిక్ ఆల్-టైమ్ రికార్డుకు చేరుకుందని ఇటీవల మస్క్, నికితా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే... ఎలాన్ మస్క్ సంపద చరిత్రలోనే తొలిసారిగా 800 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. ఆయనకు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ, ఏఐ స్టార్టప్ ఇూా×ని కొనుగోలు చేయడంతో మస్క్ ఆస్తుల విలువ సుమారు 852 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఆయన తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు.

వయ్యారి చిత్రం



సారా అర్జున్





## గ్రాండ్‌గా విజయ్-రష్మిక రిసెప్షన్

**హాజరైన సీఎం రేవంత్ రెడ్డి భార్య, చిరంజీవి, హరీశ్ రావు**

ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిత రిసెప్షన్‌కు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. గత నెల 26న వివాహ బంధంతో వీరిద్దరు ఒక్కటయ్యారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో జరిగిన రిసెప్షన్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భార్య గీత, మాజీ మంత్రులు హరీశ్ రావు, మల్లారెడ్డి, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితర రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. సినిమా పరిశ్రమ నుంచి చిరంజీవి, వెంకటేశ్, అక్కినేని నాగార్జున దంపతులు, నాగచైతన్య, రామ్ చరణ్ దంపతులు, నాని కుటుంబం, నవీన్ పోలిశెట్టి, దర్శకుడు సుకుమార్ కుటుంబం, నిర్మాత దిల్ రాజు ఫ్యామిలీ, నమ్రతా శిరోద్కర్, రాధికా శరత్ కుమార్ దంపతులు, నటి కీర్తి శెట్టి, నటుడు రవితేజ తదితరులు హాజరయ్యారు. రిసెప్షన్‌లో విజయ్, రష్మికలు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. చేతిలో చెయ్యి వేసి ఈ జంట రిసెప్షన్ వేదిక మీదకు వచ్చింది. తొలుత అతిథులను పలకరించి, ఆ తర్వాత సెలబ్రేషన్స్‌లో పాల్గొంది.

## ప్రపోజ్ చేసింది రష్మికనే: విజయ్

పెళ్లి తర్వాత తనను గుండెల్లో పెట్టుకునే అభిమానుల కోసం విజయ్, రష్మిక ఒక అద్భుతమైన గ్రీట్ అండ్ మీట్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఫ్యాన్స్‌తో కలిసి సరదాగా సమయాన్ని గడిపారు. ఇక కేవలం మాట్లాడటమే కాదు, స్వయంగా దగ్గరుండి అభిమానులకు రకరకాల వంటకాలు, స్వీట్లు వడ్డించి అందరినీ ఆశ్చర్యపరిచారు. స్టార్ హోదా ఉన్నప్పటికీ, ఫ్యాన్స్‌తో కలిసి భోజనం చేయడం ఆక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఈ సందడిలో ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు విజయ్ చాలా ఓపెన్‌గా సమాధానాలు ఇచ్చారు. అందరినీ ఊరిస్తున్న ఆ ప్రశ్న - "మీలో ముందుగా ఎవరు ప్రపోజ్ చేశారు?" దీనికి విజయ్ స్పందిస్తూ, రష్మికనే తనకు ముందుగా లవ్ ప్రపోజ్ చేసిందని నవ్వుతూ చెప్పారు. చాలా కాలం పాటు తమ ప్రేమ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచిన ఈ జంట, చివరకు పెద్దల అంగీకారంతో అట్టహాసంగా పెళ్లి చేసుకున్నారు. ఇక సినిమాల్లో వీరి కెమిస్ట్రీ ఎంత బాగుంటుందో, నిజ జీవితంలో కూడా అంతకంటే అద్భుతంగా ఒకరినొకరు గౌరవించుకుంటున్నారు. తాజాగా ఫ్యాన్స్‌తో జరిగిన ఈ ముచ్చట్లు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## ఐటం భామగా శ్రష్టి వర్మ

పుష్ప, జైలర్, గేమ్ ఛేంజర్,విక్రాంత్ రోణ, మావీరన్ లాంటి సినిమాల్లో కొరియోగ్రఫీ చేసి టాలెంట్ ప్రూవ్ చేసుకుంది శ్రష్టి వర్మ. తాజాగా ధర్మస్థల నియోజక వర్గం అనే సినిమాలో శ్రష్టి న్యాయం చేయరా దేవుడా అంటూ ఓ ప్రత్యేక గీతంలో నటిస్తోంది. అంటే పాటలో నటించడం. ఈ అమ్మడు ఇంత వరకూ హీరోయిన్లకు ఐటం పాటలు కంపోజ్ చేయడం మినహా తానే ఐటం గాల్ గా మారలేదు. ధర్మస్తల నియోజక వర్గం సినిమాలో అవకాశం రావడంతో ఛాన్స్ తీసుకుంది. ఐటం భామగా శ్రష్టి వర్మ అన్ని రకాలుగా అర్హురాలే. అందం, అభినయం తో ఐటం భామగా పక్కాగా యాప్ట్ అవుతుంది.



## సెకండ్ ఇన్నింగ్స్ పై లయ కీలక వ్యాఖ్యలు

టాలీవుడ్‌లో హోమ్లీ ఇమేజ్‌తో మెప్పించిన నటి లయ, దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వెండితెరపై మెరవనున్నారు. శివాజీతో కలిసి ఆమె నటించిన డార్క్ కామెడీ క్రైమ్ థ్రిల్లర్ 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రమోషన్స్‌లో లయ తన కొత్త ఇన్నింగ్స్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో తన పాత సాఫ్ట్ ఇమేజ్‌కు భిన్నంగా 'ఉత్తర' అనే స్వార్థపరురాలైన భార్య పాత్రలో కనిపిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. భర్తను (శివాజీ) ముప్పుతిప్పలు పెట్టే ఈ పాత్ర, కథలో చాలా కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. కేవలం ఏడుపుగొట్టు పాత్రలకే పరిమితం కాకుండా, సెకండ్ ఇన్నింగ్స్‌లో పవర్‌ఫుల్ రోల్స్ చేయాలని ఉందని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతం జగపతిబాబుతో కలిసి 'వదలా' అనే సైకలాజికల్ థ్రిల్లర్‌తో పాటు, శ్రీకాంత్‌తో ఒక సోషియో ఫాంటసీ చిత్రంలో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. కథలో బలం ఉంటే చిన్న పాత్రలకైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఈటీవీ విన్, శివాజీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీలీలకు బ్యాక్ టు బ్యాక్ చాన్సులు



తెలుగు హీరోయిన్ శ్రీలీల తెలివైన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. టాలీవుడ్ సినిమాల్లో ఐటం పాటల్లో కొనసాగితే కెరీర్ ఎలా ఉంటుంది? అన్నది అమ్మడు ముందే గుర్తించి అలెర్ట్ అయింది. దీంతో హీరోయిన్ గా వచ్చిన అవకా శాలు సైతం వదులుకోవడానికి ఎంత మాత్రం వెనకడుగు వేయలేదు. హీరోయిన్ ఛాన్స్ ఎరతో? ఐటం పాటలోనూ లాక్ చేసే ప్రయత్నాలు కొందరు చేసే సరికి వారి అతి తెలివిని పసిగట్టి మొత్తం ప్రాజెక్ట్ నే వదులుకుంది. ఈ విషయంలో అమ్మడు ఎంతో తెలివిగా ఎస్కేప్ అయింది. అప్పటి నుంచి తెలుగు అవకాశాల పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉంటుంది.

## ఇంటిమేట్ సీన్స్‌లో దిశాపటానీ



బాలీవుడ్ సీరియల్ కిస్సర్ ఇమ్రాన్ హష్మీతో సినిమా అంటే ఘాడమైన లిప్ లాక్ లు తప్పనిపరి. హీరో-హీరోయిన్ పెదవులు జుర్రుకోవడం సినిమా కే హైలైట్ గా నిలుస్తుంది. ఆ విషయంలో సీరియల్ కిస్సర్ ని కొట్టే మొనగాడే లేడు. ఇమ్రాన్ హష్మీ సుదీర్ఘ కెరీర్‌లో అనేక మంది హీరోయిన్లతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించారు. తాజాగా ఓ సినిమా కోసం మళ్లీ తనలోని సీరియల్ కిస్సర్ ని తట్టి లేపుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలొస్తున్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్ హష్మీ హీరోగా అవారపన్ కు సీక్వెల్ గా అవారపన్ 2 ని నితిన్ కక్కర్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా దిశా పటానీ నటిస్తోంది. అయితే ఈసినిమాలో కొన్ని ఇంటిమేట్ సన్నివేశాలు కూడా ఉన్నాయని వార్తలొస్తున్నాయి. హీరో-హీరోయిన్ మధ్య సన్నిహిత సన్నివేశాలను చిత్రీకరించారని తెలిసింది. అయితే వాటిలో లిప్ లాక్ సన్నివేశాలు ఉన్నాయా? లేదా? అన్నది క్లారిటీ లేదు. ఆరేళ్లగా ఇమ్రాన్ హష్మీ నో కిస్ పాలసీ పాటిస్తున్నాడు కాబట్టి? లిప్ లాక్ లేకుండా ఇంటిమేట్ సన్నివేశాలు డిజైన్ చేసారా? లేక పాలసీని పక్కన బెట్టాడా? అన్నది క్లారిటీ లేదు. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకొస్తున్న తరుణంలో ఈ విషయం లీక్ అవ్వడం సినిమాకు మంచి బజ్ ను తీసుకొస్తుంది. గ్లామర్ డాల్ దిశాపటానీ సైతం గ్లామర్ పాత్రలకు..ఇంటిమేట్ సన్నివేశాలకు నో చెప్పే నటి కాదు. ఆ విషయంలో పూర్తిగా దర్శకుల హీరోయిన్ గా పనిచేస్తుంది.

## హద్దులు చెరిపేస్తున్న రుక్మిణీ



టాక్సిక్ సినిమాలో రుక్మిణి వసంత్ బోల్డ్ పాత్రలో కనిపించబోతుందట. ఓ డాన్ కి ప్రియురాలి పాత్రలో కనిపించనుందట. దీనిలో భాగంగా అమ్మడు బెడ్ రూమ్ సీన్స్ లో కూడా కనిపించనుందని కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇప్పటి వరకూ మీరు చూసిన కనకవతి వేరు ఇకపై చూడ బోయే కనకవతి వేరు.. అంటూ మీడియా కథనాలు అంతకంతకు వేడెక్కిస్తున్నాయి. అయితే ఇంత వరకూ రుక్మిణీ వసంత్ పై డీసెంట్ ఇమేజ్ మాత్రమే ఉంది. పోషించిన పాత్రలు కూడా అంతే డీసెంట్ గా ఉంటాయి. ఎక్కడా అసభ్యతకు, అశ్లీలతకు తావు లేకుండానే నటించింది. క్లాసిక్ రోల్స్ లోనే ఎక్కువగా కనిపించింది. కానీ టాక్సిక్ అలాంటి కంటెంట్ కాదు. బోల్డ్ గా ఉంటుంది. డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే ఇంటర్నేషన్ కాన్సెప్ట్ ను తీసుకున్నారు. ఇలాంటి కథా నేపథ్యమంటే? గాల్స్ పాత్రలు కూడా అంతే బోల్డ్ గా ఉంటాయి. గన్స్, మత్తు పదార్థాలు, క్రైమ్ చుట్టూ కథ నడుస్తుంది. ఇలాంటి కథల్లో ఉమెన్ పాత్రలు అంతే హాట్గా హైలైట్ అవుతుంటాయి.







# కివీస్.. కసిగా!

## ఫైనల్ చేరిన న్యూజిలాండ్.. శతక్కొట్టిన ఫిన్ అలెన్.. రాతమారని సఫారీలు

**ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో న్యూజిలాండ్ ఫైనల్ చేరింది. బుధవారం కోల్‌కతా వేదికగా జరిగిన తొలి సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా మూడు విభాగాల్లో తేలిపోయింది. ఫిన్ అలెన్(33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 100 నాటౌట్) రికార్డ్ సెంచరీతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు.**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. మార్కో యాన్సెన్(30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. డెవాల్డ్ బ్రెవిస్(27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34), ట్రిస్టన్ స్టబ్స్(24 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 29) పర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(2/34), కోల్ మెక్‌కాంచీ(2/9), రచిన్ రవీంద్ర(2/29) రెండేసి వికెట్లు తీయగా.. లాకీ ఫెర్గూసన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 173 పరుగులు చేసి 43 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఫిన్ అలెన్(33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100 నాటౌట్) సెంచరీతో చెలరేగగా.. టీమ్ సీఫెర్ట్(33 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబడా ఒక్కడే ఒక వికెట్ తీసాడు. గురువారం భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్లో గెలిచే జట్టుతో ఆదివారం అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్ ఫైనల్ ఆడనుంది. ఈ మెగా టోర్నీలో ఓటమెరుగని జట్టుగా సెమీఫైనల్ చేరిన సౌతాఫ్రికా.. కీలక మ్యాచ్‌లో అనూహ్యంగా తేలిపోయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. దాంతో ఈ మ్యాచ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. బ్యాటింగ్ వైఫల్యం సౌతాఫ్రికా పతనాన్ని శాసించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో న్యూజిలాండ్ ఫైనల్ చేరడం ఇది రెండోసారి. టీ20 ప్రపంచకప్ 2021 టోర్నీలోనూ న్యూజిలాండ్ ఫైనల్ చేరి ఓటమిపాలైంది. 170 పరుగుల లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ తమ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ప్రారంభించింది. రబడా వేసిన రెండో ఓవర్ తొలి బంతికే టీమ్ సీఫెర్ట్ ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ వదిలేసాడు. బ్రెవిస్ పట్టాల్సిన క్యాచ్‌ను అతన్ని అడ్డుకొని డికాక్ అందుకునే ప్రయత్నం చేశాడు. కానీ బంతి దగ్గరకు చేరుకోలేక మూల్యం చెల్లించుకున్నాడు. ఈ అవకాశంతో సీఫెర్ట్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 28 బంతుల్లో సీఫెర్ట్.. 19 బంతుల్లో ఫిన్ ఎలెనన్ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని రబడా విడదీసాడు. టీమ్ సీఫెర్ట్‌ను క్లీన్ బౌల్డ్ చేసి తొలి వికెట్‌కు నమోదైన 117 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రచిన్ రవీంద్ర(13 నాటౌట్) సాయంతో ఫిన్ అలెన్ విధ్వంసం సృష్టించాడు. మార్కో యాన్సెన్ వేసిన 13వ ఓవర్‌లో ఫిన్ అలెన్ వరుసగా 4, 4, 6, 6, 4 బాది 33 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఫాస్టెస్ సెంచరీ బాదిన బ్యాటర్‌గా ఫిన్ అలెన్ నిలిచాడు.




## మార్క్‌రమ్ క్యాచ్‌పై దుమారం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ ఔటైన తీరు తీవ్ర వివాదాస్పదమైంది. మార్క్‌రమ్ ఇచ్చిన క్యాచ్‌ను న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ లాంగాన్‌లో అందుకున్నాడు. అయితే ఈ క్యాచ్‌ను అందుకునే ప్రయత్నంలో బంతి వేళ్ల మధ్యలో నుంచి నేలను తాకినట్లు రిప్లేలో కనిపించింది. కానీ అంపైర్ మాత్రం మార్క్‌రమ్‌ను ఔట్‌గా ప్రకటించారు. దాంతో ఈ వికెట్‌పై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఔట్ కాదని కొందరంటే.. ఔటేనని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రచిన్ రవీంద్ర వేసిన 8వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాంగాన్ దిశగా భారీ షాట్ ఆడాడు. అయితే అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న డారిల్ మిచెల్ ముందుకు డైవ్ చేస్తూ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లు అనిపించింది. దాంతో ఫీల్డ్ అంపైర్ మూడో అంపైర్ సమీక్ష కోరాడు. రిప్లేలో బంతి వేళ్ల మధ్యలో నుంచి నేలను తాకినట్లు కనిపించింది. కానీ థర్డ్ అంపై నితిన్ మీనన్.. బంతి కింద చేతి వేళ్లు ఉన్నాయని, ఔట్ అని ప్రకటించాడు. ఈ నిర్ణయంతో అవాక్కైన మార్క్‌రమ్.. నిరాశగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. మార్కో యాన్సెన్(30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. డెవాల్డ్ బ్రెవిస్(27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34), ట్రిస్టన్ స్టబ్స్(24 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 29) పర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(2/34), కోల్ మెక్‌కాంచీ(2/9), రచిన్ రవీంద్ర(2/29) రెండేసి వికెట్లు తీయగా.. లాకీ ఫెర్గూసన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 173 పరుగులు చేసి 43 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఫిన్ అలెన్(33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100 నాటౌట్) సెంచరీతో చెలరేగగా.. టీమ్ సీఫెర్ట్(33 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు.

# బాబర్ ఆజంపై వేటు

## కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది.. బంగ్లా పర్యటనకు ఎంపిక



పాకిస్తాన్ స్టార్ బ్యాటర్ బాబరమ్ ఆజమ్ పై వేటు పడింది. టీ20 వరల్డ్ కప్ లో వైఫల్యమే అతని పాలిట శాపంలా మారింది. ఏకంగా జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. త్వరలో బంగ్లాదేశ్ లో పర్యటించబోయే పాకిస్తాన్ జట్టులో అతనికి చోటు దక్కలేదు. ఈ సిరీస్ కోసం మొత్తం 15 మంది ప్లేయర్లతో కూడిన జట్టును కొద్దిసేపటి కిందటే ప్రకటించింది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు. స్టార్ ఫాస్ట్ బౌలర్ షహీన్ షా అఫ్రిది కేప్టెన్ గా అపాయింట్ అయ్యాడు. టీ20 వరల్డ్ కప్ లో బాబర్ ఆజమ్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. తన స్థాయికి తగ్గట్టుగా ఆడలేదతను. ఈ టోర్నమెంట్ లో బాబర్ ఆజమ్ బ్యాటింగ్ యావరేజ్ జస్ట్ 22.75 మాత్రమే. నాలుగు ఇన్నింగ్స్‌లలో అతను 91 పరుగులే చేశాడు. వ్యక్తిగత అత్యధికం స్కోరు.. 46. గత ఏడాది కూడా అతన్ని ఫెయిల్యూర్స్ వెంటాడాయి. 2025లో 17 ఇన్నింగ్స్ లల్లో 34 బ్యాటింగ్ యావరేజ్ ను నమోదు చేశాడు. అతను చేసింది 544 పరుగులు. స్ట్రైక్ రేట్ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. గత ఏడాది వన్డేల్లో బాబర్ బ్యాటింగ్ సగటు 77.16. దీంతో అతనికి మరోసారి అవకాశం ఇవ్వకూడదని భావించినట్టుంది పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్. బంగ్లాదేశ్‌తో జరిగే వన్డే ఇంటర్నేషనల్స్ సిరీస్ నుండి తప్పించింది. దీంతో పాకిస్తాన్ జట్టులో భారీ మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి.

## అభిషేక్.. సంజూ చూసి నేర్చుకో: మోర్నీ మోర్కెల్


ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మకు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అండగా నిలిచాడు. ఒకటి రెండు షాట్లు ఆడితే అభిషేక్ శర్మ తిరిగి రిథమ్ అందుకుంటాడని తెలిపాడు. ఫామ్ అందుకునే విషయంలో సంజూ శాంసన్‌ను చూసి అభిషేక్ శర్మ నేర్చుకోవాలని సలహా ఇచ్చాడు.మెగా టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ.. జింబాబ్వేతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో టచ్‌లోకి వచ్చాడు.




## భారత్ గెలవదు: మైఖేల్ వాన్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగే సెమీఫైనల్-2లో ఇంగ్లండ్ విజయం సాధిస్తుందని ఆ జట్టు మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ జోస్యం చెప్పాడు. భారత్ కంటే ఇంగ్లండ్ స్పిన్ విభాగం పటిష్టంగా ఉందని, ఫీల్డింగ్ కూడా అద్భుతమని చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ఫామ్‌లోకి వస్తే ఆ జట్టుకు తిరుగుండదని అభిప్రాయపడ్డాడు. సూపర్-8 దశలో ఇంగ్లండ్ మూడు మ్యాచ్‌లు మూడు గెలిచి గ్రూప్-2 టాపర్‌గా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే పాకిస్థాన్, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లను ఇంగ్లండ్ అతికష్టం మీద గెలిచింది. గ్రూప్ దశలో వెస్టిండీస్ చేతిలో ఓటమిపాలైన ఇంగ్లండ్.. నేపాల్ చేతిలో త్రుటిలో ఓటమిని తప్పించుకుంది. ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా గురువారం జరిగే సెమీఫైనల్-2లో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. తాజాగా ఈ మ్యాచ్ గురించి ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన మైఖేల్ వాన్.. ఇంగ్లండ్‌కే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జోస్యం చెప్పాడు. 'భారత్ కంటే ఇంగ్లండ్ జట్టుకే మెరుగైన స్పిన్ అటాక్ ఉంది. వరుణ్ చక్రవర్తిపై ప్రత్యర్థులు ఎదురుదాడి చేస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో స్పిన్ పరంగా లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, విల్ జాక్స్ అత్యుత్తమ స్పిన్ త్రయంగా నిలిచింది. ఈ త్రయం ఇంగ్లండ్‌కు గెలిచే మార్గాలను కనుగొంటుంది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ డెడ్ రబ్బర్ (ఫలితం ప్రాధాన్యం లేనిది) అయినప్పటికీ, ఆ గెలుపు జట్టు ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ముంబైలో ఇంగ్లండ్ విజయం సాధిస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఇంగ్లండ్ ఫీల్డింగ్ అద్భుతంగా ఉంది.




# ఇంగ్లండ్‌తో అమీతుమీ

**నేడు ఇంగ్లిష్ టీంతో సెమీస్**

**సిద్ధివినాయకుడ్ని దర్శించుకున్న టీమిండియా ఆటగాళ్లు**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా గురువారం ఇంగ్లండ్‌తో జరగనున్న సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, యువ బ్యాటర్ తిలక్ వర్మ బుధవారం ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక ఆలయాన్ని దర్శించుకున్నారు. వాంఖడే స్టేడియం వేదికగా జరగనున్న ఈ కీలక సమరానికి ముందు వినాయకుడి ఆశీస్సులు కోరుతూ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యకుమార్ తన అర్ధాంగి దేవిషాతో కలిసి ఆలయానికి రాగా, ఆలయ అధికారులు వారిని సత్కరించారు. అంతకుముందు అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రస్తుత టోర్నీలో భారత్ ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌లలో ఆరింటిని గెలిచి అద్భుతమైన ఫామ్‌లో ఉంది. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి మినహా టీమిండియా ప్రదర్శన బలంగా ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించి భారత్ సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ (97 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, తిలక్ వర్మ 15 బంతుల్లో 27 పరుగులు చేసి తన వంతు పాత్ర పోషించాడు. టోర్నీ ఆరంభంలో ఇబ్బంది పడ్డ తిలక్, జింబాబ్వే మ్యాచ్‌తో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. మరోవైపు, డిఫెండింగ్ ఛాంపియన్స్‌తో తలపడేందుకు ఇంగ్లండ్ కూడా సిద్ధంగా ఉంది. హ్యారీ బ్రూక్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టు సూపర్-8 దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి మంచి ఊపుమీదుంది. రెండు బలమైన జట్ల మధ్య పోరు కావడంతో వాంఖడేలో జరగనున్న ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 5-3-2026



# ప్రజా పాలనా? రాజకీయ ఎత్తుగడా?

తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో వేగం పెంచేందుకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలయ్యేలా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. పది ప్రధాన అంశాలతో రూపొందించిన ఈ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఈ ప్రణాళికను కేవలం ప్రచారం కోసం కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశించినట్లు పేర్కొంటోంది. పరిశుభ్రత, ఆరోగ్యం, రోడ్డు భద్రత, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం వంటి 10 విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. సంక్షేమ పథకాల్లో పారదర్శకత కోసం ఫేషియల్ రికగ్నిషన్ వంటి సాంకేతికతను ప్రవేశపెట్టడం, అనర్హులను తొలగించడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కలెక్టర్ల పనితీరుపై జూన్ నెలలో ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేస్తామని ప్రకటించడం ద్వారా అధికారులను మరింత బాధ్యులను చేసే ప్రయత్నం జరుగుతోంది. అయితే, దాని వెనుక రాజకీయ కోణం ఉందన్న అపవాదు వస్తోంది. విమర్శకులు మాత్రం దీనిని కేవలం 'పొలిటికల్ ప్యాకేజింగ్'గా చూస్తున్నారు. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామన్న గడువు ముగిసిన తరుణంలో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ కొత్త 99 రోజుల నినాదాన్ని తెరపైకి తెచ్చారని విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రణాళిక అమలుకు అవసరమైన నిధుల కేటాయింపులపై స్పష్టత లేకపోవడం, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి ప్రస్తావించకపోవడం రాజకీయ ఎత్తుగడగా కనిపిస్తోందని కొందరు విశ్లేషిస్తున్నారు. పార్టీలో అంతర్గత అసంతృప్తిని తగ్గించడానికి, ఢిల్లీ అధిష్టానానికి తన పట్టును నిరూపించుకోవడానికి రేవంత్ రెడ్డి ఈ అగ్రెసివ్ ప్రణాళికను ఎంచుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏ ప్రభుత్వానికైనా ప్రణాళికలు వేయడం ఒక ఎత్తయితే, వాటిని పారదర్శకంగా అమలు చేయడం మరో ఎత్తు. ఈ 99 రోజుల కాలంలో క్షేత్రస్థాయిలో పెండింగ్ ఫైళ్లు కదిలి, రైతులకు, మహిళలకు హామీ ఇచ్చిన ఫలాలు చేరితే అది నిజమైన ప్రగతి అవుతుంది. అలా కాకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైతే, ఇది మరొక రాజకీయ నినాదంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. జూన్ నెలలో విడుదలయ్యే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతుంది.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**



అగ్రరాజ్యంగా చలామణి అవుతున్న అమెరికా, ఇరాన్ విషయంలో అనుసరిస్తున్న తీరు అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక ప్రమాదకరమైన ధోరణిని ప్రతిబింబిస్తోంది. ఒక దేశం తన సొంత ప్రయోజనాల కోసం మరో దేశం సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాలరాసే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం. అంతర్జాతీయ యవనికపై ప్రజాస్వామ్య పరిరక్షకులం అని చెప్పుకునే అమెరికా, ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది.

# సార్వభౌమత్వానికి... సంకెళ్లు

గత కొన్ని దశాబ్దాలుగా ఇరాన్‌పై అమెరికా అనుసరిస్తున్న విదేశాంగ విధానం కేవలం ఆ దేశ వ్యతిరేకతకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచ దేశాల సార్వభౌమత్వానికి ఒక సవాలుగా మారుతోంది. కేవలం తన మాట వినలేదన్న కారణంతో ఒక దేశంపై ఆంక్షలు విధించడం, ఆర్థికంగా దెబ్బతీయడం, అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం అగ్రరాజ్యపు అహంకారం కాక మరేమిటి? ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ప్రతి దేశానికి తనదైన పాలనా విధానాన్ని, విదేశాంగ విధానాన్ని ఎంచుకునే హక్కు ఉంది. కానీ, అమెరికా మాత్రం నా దారికి వస్తేనే నీకు మనుగడ అనే నియంతృత్వ ధోరణిని ప్రదర్శిస్తోంది. ఇరాన్ అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా తప్పుకోవడం ద్వారా అమెరికా అంతర్జాతీయ ఒప్పందాలకు ఉన్న విలువను అపహాస్యం చేసింది. ఇది కేవలం ఇరాన్ సమస్య కాదు, రేపు మరే ఇతర దేశానికైనా ఇదే పరిస్థితి ఎదురుకావచ్చన్న హెచ్చరిక. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం కాదు, పరస్పర గౌరవం, సహకారం. అమెరికా తన ఆర్థిక, సైనిక బలాన్ని చూపిస్తూ ఇతర దేశాలను లొంగదీసుకోవాలని చూడటం అంతర్జాతీయ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు. ఇది ప్రపంచంలో ఒక ఏక ధ్రువ అరాచకాన్ని సృష్టిస్తుంది. బలహీన దేశాల గొంతు నొక్కడం ద్వారా అమెరికా ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తోంది.

ఇరాన్‌పై విధిస్తున్న కఠినమైన ఆర్థిక ఆంక్షలు ఆ దేశంలోని సామాన్య ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. మందులు, ఆహారం వంటి కనీస అవసరాలకు కూడా ఆటంకం కలిగించడం ఒక రకమైన ఆర్థిక ఉగ్రవాదం. తన రాజకీయ ఎజెండాను అమలు చేయడానికి కోట్ల మంది ప్రజల జీవితాలతో ఆడుకోవడం అగ్రరాజ్యానికి తగని పని. అగ్రరాజ్యపు అహంకారం మున్ముందు ప్రపంచాన్ని మరో ప్రచ్ఛన్న యుద్ధానికి లేదా తీవ్రస్థాయి అశాంతికి దారితీసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అంతర్జాతీయ సమాజం మేల్కోవాలి. ఏ దేశ సార్వభౌమత్వాన్ని ఆ దేశమే కాపాడుకోవాలి తప్ప, అమెరికా వంటి శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదు. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ శాంతి వర్ధిల్లుతాయి.

అగ్రరాజ్యపు ఏకపక్షాధికారం 2015లో ఇరాన్, ప్రపంచ అగ్రరాజ్యాల (పీ5 ప్లస్ 1) మధ్య కుదిరిన జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ దౌత్య విజయం. ఇరాన్ తన అణు కార్యకలాపాలను నియంత్రించుకోవడానికి, అందుకు బదులుగా ఆ దేశంపై ఉన్న ఆర్థిక ఆంక్షలను తొలగించడానికి ప్రపంచం అంగీకరించింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఇరాన్ నిబంధనలను పాటిస్తోందని పదేపదే ధ్రువీకరించినప్పటికీ, 2018లో అప్పటి అమెరికా ప్రభుత్వం ఈ ఒప్పందం నుండి ఏకపక్షంగా తప్పుకోవడం ద్వారా ప్రపంచానికి ఒక ప్రమాదకరమైన సందేశాన్ని పంపింది. అగ్రరాజ్యం తన ప్రయోజనాల కోసం ఏ చట్టాన్నైనా, ఏ ఒప్పందాన్నైనా తుంగలో తొక్కుతుందనే అహంకారాన్ని ఇది స్పష్టం చేసింది. అమెరికా కేవలం ఒప్పందం నుండి తప్పుకోవడమే కాకుండా, ఇరాన్‌పై గరిష్ట ఒత్తిడి వ్యూహాన్ని అమలు చేసింది. ఇతర దేశాలు ఇరాన్‌తో వ్యాపారం చేస్తే వారిపై కూడా ఆంక్షలు విధిస్తామని బెదిరించడం ద్వారా, ఆయా దేశాల స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, సార్వభౌమత్వాన్ని అమెరికా నేరుగా సవాలు చేసింది. ఒక దేశం ఎవరితో వ్యాపారం చేయాలి, ఎవరితో సంబంధాలు కలిగి ఉండాలి అనేది ఆ దేశ సార్వభౌమ అధికారం. కానీ అమెరికా తన ఆర్థిక వ్యవస్థను ఆయుధంగా మలచుకుని ప్రపంచాన్ని శాసించాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదించిన తీర్మానం ఆధారంగా ఈ ఒప్పందం అమలులోకి వచ్చింది. అమెరికా చర్య వల్ల ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రాబల్యం తగ్గిపోయింది. ఒక అగ్రరాజ్యం అంతర్జాతీయ చట్టాలను గౌరవించకపోతే, ఇక ప్రపంచ శాంతికి రక్షణ ఎక్కడ ఉంటుంది? ఇది కేవలం ఇరాన్‌ను నియంత్రించడం కాదు, ప్రపంచ దేశాలన్నింటికీ అమెరికా వేసిన సంకెళ్లు.

**- నవీన్ చంద్ర, హైదరాబాద్**

# పర్యావరణ పరిరక్షణే జీవకోటి రక్షణ

ప్రకృతి ఒడిలో పుట్టి, పెరిగిన మానవుడు నేడు అదే ప్రకృతికి తీరని ద్రోహం చేస్తున్నాడు. గాలి, నీరు, భూమి, ఆకాశం, అగ్ని అనే పంచభూతాల కలయికతో ఏర్పడిన ఈ పర్యావరణం సకల జీవరాశులకు మనుగడ నిస్తుంది. అయితే, ఆధునిక అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం వల్ల ఈ సమతుల్యత దెబ్బతింటోంది. పర్యావరణాన్ని కాపాడుకోవడమంటే కేవలం చెట్లను నాటడమో, కాలుష్యాన్ని తగ్గించడమో కాదు; అది మన ఉనికిని మనం కాపాడుకోవడమే.



నేడు ప్రపంచం గ్లోబల్ వార్మింగ్, అకాల వర్షాలు, భూగర్భ జలాల అడుగంటుకుపోవడం వంటి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ వినియోగం మరియు అడవుల నరికివేత వల్ల జీవవైవిధ్యం ప్రమాదంలో పడింది. ఒకప్పుడు స్వచ్ఛంగా ఉండే నదులు నేడు మురికి కూపాలుగా మారుతున్నాయి. పర్యావరణంలో ఏర్పడే ఈ అసమతుల్యత వల్ల కొత్త రకమైన వ్యాధులు ప్రబలుతున్నాయి, ఇది మానవ జీవన నాణ్యతను దెబ్బతీస్తోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48-ఏ ప్రకారం పర్యావరణాన్ని రక్షించడం మరియు అడవులను, వన్యప్రాణులను కాపాడటం రాష్ట్రం యొక్క బాధ్యత అని స్పష్టంగా పేర్కొనబడింది. అయితే, ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి విధి. ప్రతి ఇంటిలోనూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచవచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత తగ్గించడం మరియు పునర్వినియోగం పద్ధతులను అవలంబించడం అత్యవసరం. నీరు, విద్యుత్తు వంటి సహజ వనరులను వృథా చేయకుండా పొదుపుగా వాడటం వల్ల భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుంది. మహాత్మా గాంధీ అన్నట్లు, "భూమి ప్రతి మనిషి అవసరాలను తీర్చగలదు కానీ అత్యాశను కాదు". మనం ప్రకృతిని గౌరవించి, దానితో కలిసి జీవించినప్పుడే మానవజాతికి భవిష్యత్తు ఉంటుంది. నేటి ఆలస్యం రేపటి వినాశనానికి దారితీస్తుంది. కాబట్టి, పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక ఉద్యమంగా మలచి, రాబోయే తరాలకు పరిశుభ్రమైన, సురక్షితమైన భూమిని అందించాల్సిన సమయం ఆసన్నమైంది. **- రామస్వామి చింత**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.